క్లుప్తంగా

లక్ష్మీ తిరుపతమ్మతల్లి జ్యోతి ఊరేగింపు



దాచేపల్లి : మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వామి జ్యోతి ఊరేగింపు శుక్రవారం ఘనంగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిపై అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి, మాలధారులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి జ్యోతిని మేళతాళాలతో గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో జ్యోతిని దర్శించుకున్నారు. పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో స్వాములు జంగిలి నరసింహారావు, పాతురాజు నరసింహారావు, అన్నం సైదారావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే సహించేది లేదు



గురజాల: లిక్కర్ మార్టు, మద్యం దుకాణాల్లో సిబ్బంది అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ ఖాలేషా వలి హెచ్చరించారు. నగర పంచాయతీ పరిధిలోని మద్యం దుకాణాలను, లిక్కర్ మార్ట్‌ను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. జనవరి 26.. డ్రైడే రోజున మద్యం దుకాణాల్లో మద్యం విక్రయించినట్లు వచ్చిన వార్తలను ఎస్ఐ తీవ్రంగా ఖండించారు. 25వ తేదీ రాత్రి 10 గంటలకు అన్ని దుకాణాలకు సీల్ వేసినట్లు తెలిపారు. దుకాణాల్లో ఎలాంటి అమ్మకాలు జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ పి.నరసింహారావు, సిబ్బంది ఉన్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

దాచేపల్లి : లారీ ఢీకొని ద్విచక్ర వాహనంపై వెళ్తుతున్న తంగెడకు చెందిన పట్లవీటి సైదా కుమారుడు జానీబాషా(17) అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ దాసరి శివనాగరాజు వివరాల మేరకు.. స్థానికంగా ఓ ఫ్యాక్టరీ సమీపంలోని పెట్రోల్ బంకులో అయిల్ తీసుకుని జానీబాషా ద్విచక్రవాహనంపై తంగెడకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి అతి వేగంతో వచ్చిన లారీ ఢీకొట్టటంతో జానీబాషా కిందపడ్డాడు. అతనిపై నుంచి లారీ టైర్లు వెళ్లటంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ శివనాగరాజు పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మాచర్ల: పట్టణ శివారులోని సాగర్ రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఎలక్ట్రీషియన్ మృతి చెందిన ఘటన శుక్రవారం ఆర్టీసీ గ్యారేజీ వద్ద జరిగింది. పట్టణానికి చెందిన దేవళ్ళ వెంకట్రావు (47) మండలంలోని కొప్పునూరు గ్రామంలో సబ్ స్టేషన్‌లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. డ్యూటీ నుంచి మాచర్లకు వస్తుండగా డిపో వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొనటంతో రెండు కాళ్ళు విరిగిపోయాయి. అనంతరం అతనిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గుంటూరు జీజీహెచ్‌కు రిఫర్ చేయగా 108 వాహనంలోకి తీసుకెళ్తుండగా.. మృతి చెందాడు. వెంకట్రావుకు భార్య, 10వ తరగతి చదివే కుమారుడున్నాడు.

రెవెన్యూ సిబ్బందికి సత్కారం

దుర్గి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ఎల్.శివశంకర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్న స్థానిక తహసీల్దార్ కార్యాలయ సిబ్బందిని శుక్రవారం సన్మానించారు. తహసీల్దారు ఎం.రమేష్‌కుమార్ వారిని శాలువా కప్పి సత్కరించారు. ధర్మవరం వీఆర్ఏ షేక్ మస్తాన్‌వలి, ఉత్తమ బీఎల్ఓగా, ఆఫీస్ సబార్డినేట్ డి.తులసినాయక్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం అధ్యక్షులు కోటేశ్వరరావు, కోశాధికారి సుజాత, సీనియర్ అసిస్టెంట్ నిర్మల, వీఆర్ఎలు పాల్గొన్నారు.



ముంగిట్లో పెళ్లి.. అంతలో విషాదం

- వెల్దుర్తి మండలం ఉప్పలపాడు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- తెల్లవారుజామున ఆగివున్న లారీని ఢీ కొన్న పెళ్లి బృందం కారు
- ఘటనలో ఇద్దరు చిన్నారులు మృతి
- తీవ్రంగా గాయపడిన 8మంది ప్రయాణికులు
- చికిత్స కోసం నరసరావుపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలింపు
- చిన్నారుల మృతితో అలుముకున్న విషాదం
- మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి



ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఎదుట రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు



రేయ్ చిట్టి తల్లి లేరా.. కుటుంబ సభ్యుల రోదన



మృతి చెందిన చిన్నారి లింగా జస్విత



మృతి చెందిన గోనుగుంట్ల హరీష్



రోడ్డు ప్రమాదంలో నుజ్జయిన కారు

మాచర్ల / దుర్గి: రెండు ఇళ్లల్లో పెండ్లి సందడి. మరో రెండు గంటల్లో వివాహం ముగుస్తుంది. అందరిలో ఆనందం. ఐదు కిలోమీటర్లు దూరం ప్రయాణిస్తే.. పెళ్లి వేదిక. పెళ్లి బృందం అంతా కారులో సంతోషంగా వస్తున్నారు. ఇంతలో అనుకోని ప్రమాదం.. తీవ్ర విషాదాన్ని నింపింది. మండపానికి వెళ్లాల్సిన పెళ్లి కుమారుడు, కుటుంబ సభ్యులు ఆసుపత్రి పాలవ్వగా.. ఇద్దరు చిన్నారుల మృతి ఆ కుటుంబంలో తీవ్ర వేదనను మిగిల్చింది.

వివరాల్లోకి వెళితే... పల్నాడు జిల్లా దుర్గి మండలంలోని ముటుకూరు గ్రామానికి చెందిన జిల్లెలమూడి వీరబాబు, తెనాలి ప్రాంతానికి చెందిన స్వప్నతో వివాహం చేసుకునేందుకు శుక్రవారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో వెల్దుర్తి మండలంలోని శిరిగిరిపాడుకు బయలుదేరారు. పెళ్లి కుమారుడు, పెళ్లి కూతురు మూడు కార్లలో వెళుతున్నారు. ఉదయం 6.30 గంటల ప్రాంతంలో కార్లు వెల్దుర్తి శివారు ప్రాంతం ఉప్పలపాడు రోడ్డులోని పెట్రోల్ బంక్ వద్దకు చేరుకున్నాయి. ఒకవైపు తీవ్రమైన పొగ మంచు, అతివేగం కారణంగా రోడ్డుపై ఆగివున్న ట్రిప్పర్‌ను పెళ్లి కుమారుడి కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిన్నారులు గోనుగుంట్ల హరీష్ (12), లింగా జస్విత (3) మృతి చెందారు. పెండ్లి కుమారుడు వీరబాబు, కుటుంబ సభ్యులు జిల్లలమూడి వెంకటరమణ, గోనుగుంట్ల రమణ, బోయపాటి సుజాత, లింగా లక్ష్మి, లింగా పెద్దమ్మ, లింగా నాగేంద్రమ్మలు, డ్రైవర్ చంద్రశేఖర్ అలియాస్ చందు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనా స్థలానికి చేరుకున్న స్థానికులు సహాయ చర్యలు చేపట్టారు. హుటాహుటిన మాచర్ల ప్రభుత్వాసుపత్రికి వారిని తరలించారు. అక్కడ నుంచి గాయపడిన వారందరిని నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ వార్త తెలిసి ముటుకూరు గ్రామంలో తీవ్ర విషాధం నెలకొంది. గ్రామస్తులు అధిక సంఖ్యలో ప్రభుత్వాసుపత్రికి తరలి వచ్చి రోదిస్తూ ఆవేదన చెందారు. ప్రమాదానికి గురైన కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పరామార్శించారు. వారికి ధైర్యం చెప్పి.. ప్రభుత్వం తరపున అండగా నిలుస్తామని భరోసానిచ్చారు.

ఎనిమిదేళ్లకు కలిగిన సంతానం...

మేనమామ పెళ్లికొచ్చిన చిన్నారులిద్దరూ.. అర్ధంతరంగా అనంతలోకాలకు వెళ్లిపోయారు. లింగా సైదారావు, లక్ష్మి దంపతులకు వివాహమైన ఎనిమిదేళ్లకు కలిగిన ఏకైక సంతానం జస్మిత(3). పాప మృతితో..ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. ఎంతో అల్లారుముద్దుగా పెంచుకున్న తన కూతురు మృత్యువాత పడటంతో ఆ తండ్రిని ఓదార్చడం ఎవరివల్లా కాలేదు. సైదారావు రోదిస్తున్న దృశ్యం.. పలువురిని కలచి వేసింది. మరోవైపు తల్లి లింగా లక్ష్మి ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉంది. ఈమె గ్రామ వలంటీర్‌గా విధులు నిర్వహిస్తోంది. మరో బాలుడు హరీష్(12) తల్లిదండ్రులు గోనుగుంట్ల నాసరయ్య, రమణ హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. పెళ్లి నేపథ్యంలో 6వ తరగతి చదువుతున్న హరిష్.. తల్లి రమణతో కలిసి తన బంధువులు ఇంటికి గురువారం చేరారు. హరీష్ తండ్రి ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కుమారుడి మృతితో తండ్రి శోకసంద్రంలో మునిగిపోయాడు. చిన్నారుల మృతి.. ఎనిమిది మంది తీవ్రంగాయపడడంతో.. గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

ఇంటికొచ్చి..కష్టాన్ని తీర్చే ప్రభుత్వం మాది

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పిన్నెల్లి



కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

కారెంపూడి: కష్టం వస్తే.. ఇంటికే వచ్చి పరిష్కరించే ప్రభుత్వం తమదని ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చింతపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పీఆర్కే నిర్వహించారు. గ్రామంలో ఆంజనేయస్వామి, అమరలింగేశ్వరస్వామి ఆలయాల్లో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని వివరించారు. సమస్యలను వింటూ.. పరిష్కరించాలని అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలిచ్చారు. మహిళలు హారతులిచ్చారు. గుమ్మడికాయలతో దిష్టి తీశారు. యువత భారీ గజమాలతో తమ అభిమానాన్ని చాటుకున్నారు. కులాలు, మతాలు, పార్టీలకతీతంగా అందిరి బాగు కోరే ప్రభుత్వమని.. వివక్ష అనేది లేకుండా అందరికి న్యాయం చేస్తామని ఎమ్మెల్యే పీఆర్కే భరోసానిచ్చారు. గ్రామంలో 4,358 మంది జనాభా ఉంటే వారిలో 4,717 మందికి ప్రభుత్వం వివిధ రకాల సంక్షేమ పథకాలను అందించిందని ఎమ్మెల్యే పీఆర్కే చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వంలో.. పేదల జీవన ప్రమాణాలు పెరిగి వారు సంతోషంగా ఉన్న విషయాన్ని గుర్తించాలన్నారు. నర్సరావుపేట పార్లమెంటు జిల్లా పార్టీ కార్యదర్శి పంగులూరి రామకృష్ణయ్య, సర్పంచ్ ఉన్నం శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ పంగులూరి హైమావతి, ఎంపీటీసీ వేంపోగు నిర్మల, ఉన్నం ఆది శేషగిరిరావు, ఉన్నం శ్రీనివాసరావు, ఉన్నం శివయ్య, గంటా వీరయ్య, కర్నాటి శివప్రసాద్, చిరుమామిళ్ల నరసింహారావు, బొట్లకుంట రామారావు, వసంత సాంబశివరావు, కొండ, ఉమ్మినేని శివరామకృష్ణ అమరయ్య, సూరె చెంచారావు, వెంకటేశ్వర్లు, మోషెయ్య, వెంకయ్య, లంకా నాగేశ్వరరావు, ఇర్మియా, క్రాంతితో పాటు ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, జడ్పీటీసీ షేక్ షఫీ, మండల పార్టీ అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం,తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, సీఐ జయకుమార్, ఎస్ఐ రామాంజనేయులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రతిష్ట మహోత్సవాలు



జీవ ధ్వజస్తంభం ప్రతిష్టలో పాల్గొన్న భక్తులు

జెట్టిపాలెం(రెంటచింతల): మండలంలోని జెట్టిపాలెం గ్రామం శ్రీ సీతారామస్వామి ఆలయంలో శుక్రవారం ప్రతిష్ట మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగాయి. బ్రహ్మశ్రీ సాగి నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఐదు రోజులుగా యాగశాలలో రుత్వికులు హోమాలు చేస్తున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు భువనగిరి ఆంజనేయ శాస్త్రి నేతృత్వంలో జీవధ్వజ స్తంభం ప్రతిష్ఠ, శతరుద్ర సహిత శత చండీ, మహా మృత్యుంజయ యాగాలు, ముత్యాలమ్మ, పోతురాజు, పాతపాటేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, పురందేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించారు. ఉదయం వేద మంత్రాల మధ్య యంత్ర స్థాపన, విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని, స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయాన్ని విద్యుత్ తోరణాలతో వర్ణ రంజితంగా అలంకరించారు. కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

మాచవరం: పుట్టిన బిడ్డల నుంచి 16 సంవత్సరాలు వయస్సు కలిగిన ప్రతి ఒక్కరికీ వ్యాధి నిరోధక టీకాలు తప్పని సరిగా వేయించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిణి డాక్టర్ గీతాంజలి చెప్పారు. డ్రై డే కార్యక్రమంలో భాగంగా మాచవరం పీహెచ్‌సీని శుక్రవారం ఆమె సందర్శించారు. ఆసుపత్రిలో ప్రజలకు అందిస్తున్న సేవలు, సాధారణ కాన్పులు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు గురించి విచారించారు. అనంతరం మండలంలోని కొత్తపాలెం ఎస్సీ కాలనీలో పర్యటించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు చక్రవర్తి, ప్రసాదు, సిబ్బంది పాల్గొన్నారు.

దాచేపల్లి కమిషనర్ శ్రీవిద్యకు సన్మానం



కమిషనర్ శ్రీవిద్యను సన్మానిస్తున్న చైర్మన్ ఖాదర్‌బాషా, సిబ్బంది

దాచేపల్లి: గణతంత్ర్య దినోత్సవం సందర్భంగా కలెక్టర్ శివశంకర్ చేతుల మీదుగా అవార్డు, ప్రశంసా పత్రం అందుకున్న స్థానిక నగర పంచాయతీ కమిషనర్ శ్రీవిద్యను.. చైర్మన్ షేక్ ఖాదర్‌బాషా, కార్యాలయం సిబ్బంది శుక్రవారం సన్మానించారు. నగర పంచాయతీ కార్యాలయంలో ఆమెకు అభినందనలు తెలియజేశారు. అనంతరం కమిషనర్ శ్రీవిద్య మాట్లాడారు. తాను కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంటనే మొట్టమొదటి సారిగా ఏర్పడిన దాచేపల్లి నగర పంచాయతీ ఎన్నికలు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహించానని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సహకారంతో కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నామని, రెండు వేల మందికి ఇళ్ల స్థలాలు కేటాయించామని చెప్పారు. జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణంలో జిల్లాలో రెండవ స్థానంలో నిలిచామని వివరించారు. ఇప్పటికే రూ.14కోట్లతో అభివృద్ధి పనులు చేశామని, అమృత్ 2.0 ద్వారా రూ.16.08 కోట్లతో ప్రతి ఇంటికి తాగునీరు అందించే పనులు చేపట్టబోతున్నామని తెలిపారు. అవార్డులు తీసుకోవడం ద్వారా తన బాధ్యత మరింతగా పెరిగిందన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో నగర పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిస్తానని కమిషనర్ చెప్పారు. వైస్ చైర్మన్ కొమెరబత్తిన విజయ్‌కుమార్, ఆర్ఐ ప్రసాద్, సీఓ విజయలక్ష్మి, స్థానిక నాయకులు షేక్ దాడీ, సాగర్, అఖిల్, వెలుగు సిబ్బంది తదితరులున్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

రెంటచింతల: మండలంలోని జెట్టిపాలెం గ్రామశివార్లో వేంచేసిన తిమ్మాపురి చౌడేశ్వరి అమ్మవారికి శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకులు కొండా అంకారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద యంత్ర ప్రతిష్ఠను భక్తిశ్రద్ధలతో జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తి శ్రద్ధలతో పంచ కలశ శోభాయాత్ర



పిడుగురాళ్ల: పట్టణంలోని సువర్చల సమేత శ్రీ ప్రసన్నాంజనేస్వామి 16వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పంచ కలశ శోభ యాత్ర, ప్రత్యేక పూజా కార్యక్రమాలు వేడుకగా జరిగాయి. కలశ శోభయాత్రకు మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవలయం నుంచి మహిళా భక్తులు కలశాలతో యాత్రలో పాల్గొన్నారు. యాత్రను జెండా ఊపి మున్సిపల్ చైర్మన్ వెంకట సుబ్బారావు ప్రారంభించారు. అక్కడి నుంచి ప్రసన్నాంజనేస్వామి దేవలయం వద్దకు యాత్ర చేరుకొంది. స్వామి వారి రథానికి పూజలు నిర్వహించారు. స్వామి వారి భారీ విగ్రహానికి పంచ కలశాలతో ప్రత్యేక అభిషేకాలు చేశారు. శనివారం స్వామివారి కల్యాణానికి కోటిలింగ మహా దైవక్షేత్ర పీఠాధిపతి శ్రీ శివస్వామి హాజరు కానున్నారని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.





నేడు భావనా రుషి స్వామి శాంతి కల్యాణం



చర్లగుడిపాడు గ్రామంలో భావనా రుషి దేవాలయం



దేవాలయంలో కొలువైన స్వామి వారు

గురజాల : మండలంలోని చర్లగుడిపాడు గ్రామంలో శ్రీ భద్రావతి సమేత భావనా రుషి స్వామి దేవాలయంలో శనివారం శాంతి కల్యాణం నిర్వహించేందుకు పద్మశాలీయుల కమిటీ, దేవాలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి ఏడాది రథ సప్తమి రోజున పద్మశాలీయుల ఆరాధ్య దైవం శ్రీ భద్రావతి సమేత భావనా రుషి స్వామి వారి కల్యాణం వైభవోపేతంగా నిర్వహిస్తారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ ఆనందంగా, సుఖ సంతోషాలతో జీవించాలనే అకాంక్షతో ఈ శాంతి కల్యాణం నిర్వహించడం జరుగుతుందని పెద్దలు తెలిపారు.

నేటి కార్యక్రమాలు

వేకువ జామున స్వామి వారికి సుప్రభాత సేవ, పుణ్యాహ వచనం, మధ్యాహ్నం పుట్ట బంగారం కార్యక్రమం, అనంతరం స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామి వారిని గ్రామ పుర వీధుల్లో ఊరేగించనున్నారు. ఆదివారం సాయంత్రం గ్రామంలో అన్నదానం చేయనున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పద్మశాలీ కమిటీ, దేవాలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి: ఎంపీపీ కొమ్మినేని



మాట్లాడుతున్న ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ

గురజాల: మండలంలోని గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ..అధికారులను, ప్రజా ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడారు. గ్రామాల్లో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని.. పరిష్కరించేందుకు తక్షణ చర్యలు చేపడతామని చెప్పారు. మౌలిక వసతులు, సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టే విధంగా ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ వేయకుండా స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని.. ఇందుకు ప్రతి అధికారికి ప్రజలు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని సూచించారు. మాడుగుల వైద్యురాలు పద్మావతి మాట్లాడుతూ.. ఇంటి వద్దకే వైద్యం అనే నూతన కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఏపీఎం భాస్కర్ మాట్లాడుతూ గ్రామాల్లో నిరుద్యోగులకు.. ఉద్యోగ అవకాశం కల్పించే విధంగా జాబ్ మేళాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జాబ్‌మేళా కార్యక్రమంలో ఖర్చుల నిమిత్తం.. తన గౌరవ వేతనం ఇవ్వనున్నట్లు కో-ఆప్షన్ సభ్యుడు షేక్ పీర్ అహ్మద్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఫణికుమార్ నాయక్, వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

